www.ninadam.in

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

డిజిటల్ ఎడిషన్

మంగళవారం ఏప్రిల్ 21 2026 ninadam.in

## ఇరాన్‌తో ఒప్పందం కోసం ఇస్లామాబాద్ వెళ్లనున్న ట్రంప్ !

- ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు,
- ఒప్పందం కుదిరితే చర్చలకు హాజరుకానున్న ట్రంప్,
- చర్చల్లో పాల్గొనడంపై ఇరాన్ సానుకూల సమీక్ష,
- రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగింపు దశలో చర్చలు,
- అణు కార్యక్రమం, ఆంక్షలపై ఇరు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు



**ఢిల్లీ, ఏప్రిల్ 21 (నినాదం):** అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చలకు రంగం సిద్ధమైంది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఈ వారం ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఒకవేళ ఒప్పందం కుదిరితే, దానిపై సంతకం చేయడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా లేదా వర్చువల్‌గా హాజరయ్యే అవకాశం ఉందని రాయిటర్స్ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది. ఇరు దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే, ఈ గడువును పొడిగించే అవకాశం చాలా తక్కువని ట్రంప్ ఇప్పటికే స్పష్టం 2లో

## కూటమి నేతల ప్రకటనలు సముచితంగా లేవు

### - చంద్రబాబుకు తెలంగాణ మంత్రి పొన్నం లేఖ

- రాష్ట్ర విభజనపై కూటమి నేతల వ్యాఖ్యలు సరిగా లేవన్న పొన్నం
- ఇలాంటి వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విద్వేషాలను రగిలించే ప్రమాదం ఉందని హెచ్చరిక
- రెండు రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు సాగడం అవసరమని వ్యాఖ్య



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నినాదం):** ఆంధ్రప్రదేశ్ – తెలంగాణ రాష్ట్రాల విభజన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ అంశానికి సంబంధించి తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ఏపీ సీఎం చంద్రబాబుకి లేఖ రాశారు. రాష్ట్ర విభజనపై ఇటీవల కొందరు నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రెండు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయని లేఖలో పొన్నం ఆందోళన వ్యక్తం చేశారు. విభజనను తప్పుబడుతూ టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు చేస్తున్న ప్రకటనలు సముచితంగా లేవని... ఇవి ప్రజల మధ్య విద్వేషాలను రగిలించే ప్రమాదం 2లో

# అబద్దాలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట

## పదేళ్లలో అబద్దాలతోనే పాలన చేశారు

## బీఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ

## రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష




**నల్గొండ, ఏప్రిల్ 21 (నినాదం):** అబద్దాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు. అబద్దాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడో విచ్చిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆర్ఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి 2లో

## తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నినాదం):** తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 38ను విడుదల చేసింది. ఈ బదిలీల ప్రక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో 2లో

## కేంద్ర నిధులపై చర్చకు సిద్ధమా?

- రేవంత్, కేసీఆర్ లకు రాంచందర్ రావు సవాల్



**హైదరాబాద్ ఏప్రిల్ 21 (నినాదం):** తెలంగాణ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం అందించిన నిధుల విషయంలో తాము చర్చకు ఎప్పుడూ సిద్ధమేనని రాష్ట్ర బీజేపీ చీఫ్ రాంచందర్ రావు స్పష్టం చేశారు. గత పదేళ్లలో కేంద్రం తెలంగాణకు రూ. 12 లక్షల కోట్లు ఇచ్చిందని, 2లో

## రేవంత్ రెడ్డి మొదటి నుంచి సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ

- మేం పాలన మార్పు కోరుకుంటున్నాం కానీ రేవంత్ రెడ్డికి కీడు జరగాలని కోరుకోవడం లేదని వ్యాఖ్య
- కేసీఆర్ లేకుంటే ఆయన ముఖ్యమంత్రి అయ్యేవాడా అని ప్రశ్న : జీవన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నినాదం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తుగా మారిపోయారని నిన్న బీఆర్ఎస్ పార్టీలో చేరిన జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి విమర్శించారు. ఆయన మొదటి నుంచి సీమాంధ్ర నాయకుల చేతిలో కీలుబొమ్మగానే ఉంటున్నారని అన్నారు. 2లో



## రేవంత్ రెడ్డి 'యూ-టర్న్' తీసుకున్నారు..

### కాళేశ్వరంపై బండి సంజయ్ నిప్పులు

- ఈ ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదని గతంలో రేవంత్ అన్నారన్న సంజయ్
- లక్ష కోట్ల అవినీతి జరిగిందని గగ్గోలు పెట్టారన్న కేంద్ర మంత్రి
- ఇప్పుడు కేవలం రూ. 9 వేల కోట్ల స్కామ్ జరిగిందని సీబీఐకి లేఖ రాశారని విమర్శ

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నినాదం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రేవంత్ రెడ్డి మాట మారుస్తున్నారని ఆరోపించారు. గతంలో ఈ ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదని, 2లో

## దక్షిణాదిపై వివక్ష.. డీలిమిటేషన్ ప్రజాస్వామ్యంపై దాడి

- తమిళనాట కేజ్రీవాల్ గర్జన!



**చెన్నై, ఏప్రిల్ 21 (నినాదం):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం ముగుస్తున్న తరుణంలో, డీఎంకే కూటమికి మద్దతుగా ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్రం చూపుతున్న వివక్షను ఆయన ఎండగట్టారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును కేజ్రీవాల్ 'ప్రజాస్వామ్యంపై దాడి'గా అభివర్ణించారు. జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించేలా ఈ బిల్లు ఉందని, అందుకే 2లో

## తెలంగాణలో యువత అంతా ఏమైంది?..

- 75 ఏళ్ల వ్యక్తి నవ యువకుడా? - కేసీఆర్ సభపై కవిత సెటైర్లు
- ఈ నెల 25న కొత్త రాజకీయ పార్టీని ప్రకటించనున్న కల్వకుంట్ల కవిత
- మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు
- జీవన్ రెడ్డి చేరికపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టిన కవిత
- ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటన



**హైదరాబాద్ ఏప్రిల్ 21 (నినాదం):** తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయంగా నిలిచేందుకు జాగృతి 2లో

### తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్..

## నేటి అర్ధరాత్రి నుంచి బస్సులు బంద్!

- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్
- చర్చలకు ప్రభుత్వం నుంచి స్పందన కరవు
- సమ్మెకు జేఏసీతో పాటు ఇతర కార్మిక సంఘాల పూర్తి మద్దతు
- ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించిన ప్రభుత్వం


**హైదరాబాద్ ఏప్రిల్ 21 (నినాదం):**




తెలంగాణలో ఆర్టీసీ సమ్మెకు సర్వం సిద్ధమైంది. మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మె ప్రారంభం కానుంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాలు ఈ నిర్ణయం 2లో

### తమిళనాడు ఎన్నికల వేళ

## ధన ప్రవాహం..



### రూ.1200 కోట్లకు పైగా సొమ్ము సీజ్

- అత్యంత సమస్యాత్మకంగా 105 నియోజకవర్గాలు
- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ భారీగా నగదు, బంగారం సీజ్
- వృద్ధులు, దివ్యాంగుల కోసం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం
- తిరువళ్లూరు, చెన్నై జిల్లాల్లో అత్యధికంగా సొమ్ము పట్టివేత

**చెన్నై, ఏప్రిల్ 21 (నినాదం):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు ఇంకా కొన్ని రోజులే సమయం ఉండటంతో ఎన్నికల అధికారులు తనిఖీలను తీవ్రతరం చేశారు. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా భారీగా నగదు, బంగారం, మద్యం, మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు పట్టుబడిన సొమ్ము, వస్తువుల మొత్తం విలువ రూ.1200 కోట్లు దాటిందని అధికారులు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణ బృందాలు నేరుగా రూ.500 కోట్లకు పైగా విలువైన నగదు, వస్తువులను సీజ్ చేయగా, ఆదాయపు పన్ను శాఖ వంటి ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు జరిపిన సోదాల్లో మిగతా మొత్తం పట్టుబడింది. నగదుతో పాటు, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన భారీ మొత్తంలో మద్యం, నిషేధిత పదార్థాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో కూపన్లు, ఇతర ఉచితాలను పంపిణీ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో, ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి సుమారు 100 2లో




## బెంగాల్‌లో ఐప్యాక్ సేవలకు బ్రేక్..

### బీజేపీ కుట్రేనన్న తృణమూల్


- పశ్చిమ బెంగాల్‌లో కార్యకలాపాలు తగ్గించిన ఐప్యాక్
- ఈడీ దాడులు, డైరెక్టర్ అరెస్ట్‌తో కీలక నిర్ణయం
- క్షేత్రస్థాయి కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేత
- ఇది బీజేపీ ప్రభుత్వ కుట్రేనని టీఎంసీ ఆరోపణ
- సేవలు కొనసాగుతున్నాయని, ఎవరికీ నష్టం జరగదని టీఎంసీ హామీ

2లో

### ఉపాధి హామీ పథకాన్ని

## కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోంది

- గ్రామీణ ఆర్థిక వ్యవస్థను టీడీపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందన్న జగన్
- అవినీతిపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శ



**అమరావతి, ఏప్రిల్ 21 (నినాదం):** టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవనాధారమైన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (ఎంజీఎన్ఆర్ఈజీఏ) ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. దీనివల్ల రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 2లో


### తమిళ భవిష్యత్ కోసం

## ఎన్‌డిఏకు ఓటేయండి

### పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి

### మోడీ నేతృతత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం

### ఎన్‌డిఏ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం



**చెన్నై, ఏప్రిల్ 21 (నినాదం):** తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని.. చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఏ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు 2లో

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్
మంగళవారం ఏప్రిల్ 21 2026
ninadam.in



## తమిళనాడు ఎన్నికల వేళ
# ధన ప్రవాహం..

కేసులు నమోదు చేశారు. జిల్లాల వారీగా చూస్తే, తిరువళ్లూరులో అత్యధికంగా సొమ్ము పట్టుబడగా, ఆ తర్వాత చెన్నై నిలిచింది. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా 95 శాతానికి పైగా ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయిందని అధికారులు వెల్లడించారు. మొత్తం 234 నియోజకవర్గాల్లో 105 నియోజకవర్గాలను ఎన్నికల వ్యయం పరంగా సున్నితమైనవిగా గుర్తించారు. అలాగే, 5,938 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించి, అక్కడ అదనపు భద్రతను ఏర్పాటు చేశారు. ఇప్పటికే 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల సహా రెండు లక్షల మందికి పైగా ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్వేచ్ఛాయుతమైన, పారదర్శకమైన పోలింగ్ నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, కేంద్ర సాయుధ బలగాలను కూడా మోహరించామని అధికారులు పునరుద్ఘాటించారు.

## ఉపాధి హామీ పథకాన్ని కూటమి సర్కార్ నిర్వీర్యం చేస్తోంది

ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయి, ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆదాయాన్ని పెంచడంలో ఉపాధి హామీ పథకం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. చారిత్రకంగా ఈ పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉండేదని, కానీ గత రెండేళ్ల టీడీపీ కూటమి పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని విమర్శించారు. ఆమోదించిన లేబర్ బడ్జెట్, పథకం కింద పనిచేసిన కుటుంబాల సంఖ్య, మొత్తం వ్యయం వంటి అన్ని కొలమానాల్లోనూ పనితీరు గణనీయంగా తగ్గిపోయిందని ఆయన వివరించారు. ఈ ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై స్పష్టంగా కనిపిస్తోందని జగన్ తెలిపారు. గత రెండేళ్లుగా జీఎస్టీ, అమ్మకం పన్ను వసూళ్లు మందగించడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. “టీడీపీ కూటమి ప్రభుత్వం అవినీతి, సంపదపై ఉన్న యావతోనే నిమగ్నమై ఉంది. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి పెట్టే సమయం వారికి లేదు“ అని జగన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం తన ప్రాధాన్యతలను మార్చుకొని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కూటమి నేతల ప్రకటనలు సముచితంగా లేవు

ఉందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా, లోక్‌సభలో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య రాష్ట్ర విభజనపై చేసిన వ్యాఖ్యలను పొన్నం ప్రభాకర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఆ వ్యాఖ్యలను లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించేలా చంద్రబాబు చొరవ తీసుకోవాలని, ఈ మేరకు స్పీకర్‌కు లేఖ రాయాలని కోరారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, తన మిత్రపక్ష నేతలకు సర్దిచెప్పి ఇలాంటి సున్నితమైన అంశాలపై బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చూడాలని అన్నారు. రాష్ట్రం విడిపోయి దశాబ్ద కాలం గడిచినా, ఇంకా పాత గాయాలను రేపేలా మాట్లాడటం వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని మంత్రి స్పష్టం చేశారు. “రెండు రాష్ట్రాలు పాత విభేదాలను పక్కనపెట్టి, పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగడం తక్షణ అవసరం“ అని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. చంద్రబాబు తన వినతిని అర్థం చేసుకుని, సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగులలో 40 శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

## కేంద్ర నిధులపై చర్చకు సిద్ధమా?



కేవలం గత రెండేళ్లలోనే రూ. 1.5 లక్షల కోట్లు కేటాయించిందని గణాంకాలతో వివరించారు. కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమని, వారు ఎప్పుడు సిద్ధమో చెబితే తాను వస్తానని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ఢిల్లీకి వచ్చింది కేవలం కాళేశ్వరం కేసులో చట్టపరమైన సలహాల కోసమేనని, ఆయన తమతో ఎలాంటి రాయబారాలు నడపడం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం మీద సీబీఐ విచారణ కోరాల్సింది పోయి, కేవలం నాణ్యత లేని బ్యారేజీల మీద మాత్రమే విచారణ కోరడం రేవంత్ రెడ్డి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని ఎండగట్టారు. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన ప్రాజెక్టుపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి, కేసీఆర్ కేవలం బీజేపీ ఎదుగుదలను అడ్డుకోవడమే లక్ష్యంగా సమావేశాలు నిర్వహిస్తున్నారని, గత పదేళ్లుగా బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి ప్రజాధనాన్ని దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి

మాట్లాడుతూ..’తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది. ??ముందుచూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం’ అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు.

# బెంగాల్‌లో ఐప్యాక్ సేవలకు బ్రేక్..

**కొలకట్ట, ఏప్రిల్ 21 (నినాదం):** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల వేడి తారస్థాయికి చేరుకున్న వేళ, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) కోసం పనిచేస్తున్న రాజకీయ వ్యూహరచన సంస్థ ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ (ఐప్యాక్) తన కార్యకలాపాలను గణనీయంగా తగ్గించుకుంది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చర్యల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయి కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసి, పలు విభాగాల ఉద్యోగులను వర్క్ ఫ్రమ్ హోమ్ (ఔఫీఎ) విధానంలో పనిచేయమని ఆదేశించింది. ఇటీవల ఐప్యాక్ డైరెక్టర్ వినేష్ చాందెల్‌ను ఈడీ అరెస్ట్ చేయడం, సంస్థ నాయకత్వాన్ని పలుమార్లు విచారణకు పిలవడంతో న్యాయపరమైన ఆందోళనలు పెరిగాయి. దీంతో ఐప్యాక్ తన కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణకు సిద్ధమైంది. ఏప్రిల్ 18న ఉద్యోగులతో మాట్లాడిన సంస్థ యాజమాన్యం, ‘న్యాయపరమైన కారణాలతో‘ కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు ప్రాథమికంగా తెలిపింది. అధికారిక ఈ-మెయిల్స్ వాడొద్దని, బయటివారితో సంబంధాలు పరిమితం చేసుకోవాలని సూచించింది. ఎన్నికల వేళ కీలకమైన ఐప్యాక్ వాట్సాప్ మీడియా గ్రూపులు శనివారం నుంచి నిశ్శబ్దంగా మారడం ఈ పరిణామాలకు బలం చేకూరుస్తోంది. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. తమ ప్రచార యంత్రాంగాన్ని దెబ్బతీసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించింది. మొదట ఐప్యాక్ సేవలు నిలిచిపోయాయన్న వార్తలను ఖండించినా, తర్వాత పార్టీ నేతలు ఆచితూచి స్పందించారు. రాజ్యసభ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్ మాట్లాడుతూ.. “మేం పలు ఏజెన్సీలతో కలిసి పనిచేస్తాం. వారిలో పనిచేస్తున్న యువ నిపుణుల భవిష్యత్తుకు ఎలాంటి ప్రమాదం రానివ్వం. మా ముఖ్యమంత్రి అందరినీ ఆదుకుంటారని హామీ ఇచ్చారు“ అని భరోసా ఇచ్చారు. అయితే, కార్యకలాపాలు తగ్గించినప్పటికీ ఐప్యాక్ తన సేవలను టీఎంసీకి పూర్తిగా నిలిపివేయలేదు. ప్రచారానికి సంబంధించిన పనులు కొనసాగుతున్నాయని టీఎంసీ వర్గాలు తెలిపాయి. బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల పోలింగ్ జరగనుండగా, మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.


## రేవంత్ రెడ్డి మొదటి నుంచి సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ

2015లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో, వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా చేయాలనే ఉద్దేశంతో ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి దొరికిపోయారని పేర్కొన్నారు. ఆయనకు రాజ్యాంగం పట్ల గౌరవం లేదని విమర్శించారు. ఆయన ఆంధ్రా తొత్తులా మారి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలన పోయి కేసీఆర్ పాలన రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మేం పాలన మార్పు కోరుకున్నాం తప్ప, భౌతికంగా రేవంత్ రెడ్డి కీడును తాము కోరుకోలేదని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారంటే అది కేసీఆర్ పుణ్యమే అన్నారు. కేసీఆర్ ఉద్యమించకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. అలాంటి ఉద్యమనాయకుడిని పట్టుకుని ఉరితీస్తానని అంటావా అని ప్రశ్నించారు. జగిత్యాలలో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సమయంలోనే రేవంత్ రెడ్డి కావాలని మేడిగడ్డ పర్యటనను పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని, కానీ రేవంత్ రెడ్డి తానే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉంటానని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అన్నీ గమనిస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరారని... ఎన్డీఏకు, రేవంత్ రెడ్డికి మధ్య చంద్రబాబు వారధిగా ఉన్నారని అన్నారు. తనను చంద్రబాబు కాపాడుతారని ఆయన భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడంలేదని అన్నారు. నాదెండ్ల భాస్కరరావు అంశం గురించి రేవంత్ రెడ్డి తెలియకుండా మాట్లాడుతున్నారని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఆయనకు మద్దతుగా తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని వెల్లడించారు. తనను ఎవరూ తొలగించలేదని, తనంతట తానే రాజీనామా చేశానని అన్నారు. తనతో పాటు ఇందిరాగాంధీ, కాంగ్రెస్ సహా అందరూ నాదెండ్లకు మద్దతుగా నిలిచారని వెల్లడించారు. ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియదేమో అని విమర్శించారు.

# కేసీఆర్ ఆదేశాల మేరకే ఢిల్లీకి వెళ్లాను..!

- తన ఢిల్లీ పర్యటనపై రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చారని విమర్శ
- విషయం ఉన్నవారు ఎవరూ ఇలాంటి పనులు చేయరన్న హరీశ్ రావు
- రేపు సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ ఉందని వెల్లడి

**హైదరాబాద్ ఏప్రిల్ 21 (నినాదం):** తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాను ఢిల్లీకి వెళ్లానని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయన చెప్పిన పని కోసమే తాను, వినోద్ కుమార్ తదితరులం వెళ్లామని చెప్పారు. ముఖ్యమంత్రి పెట్టే అక్రమ కేసులను ఎదుర్కోవడానికి, కాళేశ్వరం కేసులపై ఢిల్లీకి వెళ్లి లాయర్లతో చర్చించినట్లు చెప్పారు. కానీ తన ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చారని, మీడియా వాళ్లతో అర్థం లేని బ్రేకింగ్‌లు పెట్టించారని ఆరోపించారు. విషయం ఉన్న వారు ఎవరైనా ఇలాంటి పనులు చేయరని,



విషయం లేనివారే ఇలా చేస్తారని విమర్శించారు.

రేపు ఓటుకు నోటు కేసు విచారణ

రేపు ఓటుకు నోటు కేసు కూడా సుప్రీంకోర్టులో విచారణకు రానుందని, ఆ కేసు గురించి న్యాయవాదులతో చర్చించామని అన్నారు. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి, హోంమంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం తరపున అనామక లాయర్‌ను పెట్టారని విమర్శించారు. నిందితుల తరపున మాత్రం ప్రముఖ లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారని చెప్పారు. రేపటి విచారణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముద్దాయిగా ఉన్నారని గుర్తు చేశారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్ గాంధీతో, ఉదయం బీజేపీ వారితో తిరిగారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నిన్న బయటకు వచ్చినందనే రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేశారని అన్నారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సిన సొమ్మును పంట చేతికి వచ్చాక ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి, తమ పార్టీ అధినేత కేసీఆర్ స్థాయి ఏమిటో తెలంగాణ ప్రజలకు నిన్నటి బహిరంగ సభలతో అర్థమైందని అన్నారు. కేసీఆర్ జగిత్యాల సభ ప్రసంగాన్ని 36 లక్షలమంది చూస్తే, రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కేవలం 4 లక్షలమంది మాత్రమే చూశారని అన్నారు. రేవంత్ రెడ్డి తెలిసి చేశారో లేక తెలియక చేశారో కానీ కేసీఆర్ సభ సమయంలోనే రేవంత్ రెడ్డి తన సభను ఏర్పాటు చేసుకోవడంతో ఎవరి రేటింగ్ ఏమిటో తెలిసిందని అన్నారు.

## కేసీఆర్ తన కళ్లతో బీఆర్ఎస్ అంతం కావడం చూడాలని కోరుకుంటున్నాం

\- ధర్మపురి అర్వింద్

**నిజామాబాద్, ఏప్రిల్ 21 (నినాదం):** కేసీఆర్ తన కళ్లతో బీఆర్ఎస్ అంతమవడం చూడాలని తాము కోరుకుంటున్నామని, అది కూడా త్వరలో జరుగుతుందని నమ్ముతున్నామని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కేసీఆర్‌ను అందరికంటే ఎక్కువగా కేటీఆర్, కవిత, హరీశ్ రావులే హింసిస్తున్నారని ఆరోపించారు. కవిత, కేటీఆర్‌లకు ఫ్లైట్ టిక్కెట్ ఇచ్చి పంపిస్తే కేసీఆర్



దరిద్రంతో పాటు తెలంగాణ దరిద్రం కూడా వదులుతుందని వ్యాఖ్యానించారు. అర్వింద్ రైతుల సమస్యలపై కూడా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. రైతుల గోడును పట్టించుకునే వారే కరవయ్యారని అన్నారు. ఈ సందర్భంగా పసుపు రైతులకు ఆయన కీలక హామీ ఇచ్చారు. తాను రాజకీయాల నుంచి తప్పుకునే లోపు పసుపు పంటకు క్వింటాల్‌కు రూ.30 వేల మద్దతు ధర పలికించి తీరుతానని అన్నారు. రైతుల ప్రయోజనాలే తనకు ముఖ్యమని చెప్పారు.

# అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ దిట్ట

దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. మేమెప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం. నల్గొండ జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదయ్యాయని మంత్రి తెలిపారు.

## తెలంగాణలో యువత అంతా ఏమైంది?..

అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కొత్త రాజకీయ ప్రస్థానానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ నెల 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా కొత్త రాజకీయ పార్టీని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆమె అధికారికంగా ప్రకటించారు. తన కొత్త పార్టీలో యువతకు, తెలంగాణ ఉద్యమకారులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరుపై, ముఖ్యంగా మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై ఆమె తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగిత్యాలలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ సభలో సీనియర్ నేత జీవన్ రెడ్డి ఆ పార్టీలో చేరారు. ఈ సభలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కవిత తీవ్రంగా తప్పుబట్టారు. 75 ఏళ్ల కురువృద్ధుడిని పార్టీలో చేర్చుకుని, ఆయనకు 25 ఏళ్లు తగ్గిపోయాయని, నవ యువకుడిగా అద్భుతాలు చేస్తారని కేసీఆర్ పొగడటం హాస్యాస్పదమన్నారు. అలాంటప్పుడు రాష్ట్రంలోని లక్షలాది మంది నిరుద్యోగ యువకులు ఏమవ్వాలని ఆమె ప్రశ్నించారు. యువత ఆకాంక్షలను గుర్తించడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పచ్చి తెలంగాణ వ్యతిరేకి అయిన జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకుని, తెలంగాణ పునర్నిర్మాణం గురించి మాట్లాడటం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉట్టి కథలు చెబుతుంటే, అధికార కాంగ్రెస్ పార్టీ పిట్ట కథలు చెబుతోందని, కానీ ఏ ఒక్కరూ ప్రజల కష్టాల గురించి మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించి ప్రజలు తప్పు చేశారని కేసీఆర్ అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి వారిని తప్పుబట్టడం సరికాదన్నారు. బీఆర్ఎస్ సభలో బీజేపీని పల్లెత్తు మాట అనలేదని, మహిళా రిజర్వేషన్ల ఊసే ఎత్తలేదని ఆమె మండిపడ్డారు. రాజకీయ పునరేకీకరణ పేరుతో ఆ పార్టీ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తోందని దుయ్యబట్టారు. కొత్త పార్టీ ప్రకటన నేపథ్యంలో నగరవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్ల ఏర్పాటు విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు సహకరించాలని, అడ్డంకులు సృష్టించవద్దని కవిత కోరారు. ప్రజాస్వామ్యంలో కొత్త శక్తులు ఎదిగేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో తమ సమస్యల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెకు కవిత తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ప్రజల గొంతుకగా నిలిచేందుకే తాను నూతన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

# ఇరాన్‌తో ఒప్పందం కోసం ఇస్లామాబాద్ వెళ్లనున్న ట్రంప్ !

చేశారు.

ఇరాన్ హాజరుపై సందిగ్ధత

అయితే, ఈ చర్చల్లో ఇరాన్ పాల్గొంటుందా లేదా అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల హర్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్‌కు చెందిన నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడంతో చర్చలకు హాజరుకాబోమని టెహ్రాన్ మొదట ప్రకటించింది. కానీ, తాజాగా తమ వైఖరిని సానుకూలంగా సమీక్షిస్తున్నామని, అయితే తుది నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపినట్లు రాయిటర్స్ పేర్కొంది. చర్చలు జరుగుతాయనే విశ్వాసాన్ని అమెరికా వ్యక్తం చేస్తోంది. ఈ కీలక చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ మంగళవారం పాకిస్థాన్‌కు వెళ్లనున్నట్లు అమెరికా వర్గాలను ఉటంకిస్తూ ఏక్సియోస్ నివేదించింది.

ఇరు దేశాల డిమాండ్లు, హెచ్చరికలు

ఈ చర్చలు విజయవంతం కావడానికి ఇరు దేశాల డిమాండ్లు పెద్ద అడ్డంకిగా మారాయి. చమురు ధరలు, స్టాక్ మార్కెట్లు కుప్పకూలకుండా చూసే ఒప్పందం కోసం ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. అయితే, ఇరాన్‌కు అణ్వాయుధాలు అభివృద్ధి చేసే సామర్థ్యం ఉండకూడదని ఆయన గట్టిగా పట్టుబడుతున్నారు. మరోవైపు, యుద్ధాన్ని నివారించి, తమపై ఉన్న ఆంక్షలను సడలించే ఒప్పందం కోసం ఇరాన్ ఎదురుచూస్తోంది. కానీ, తమ అణు కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని స్పష్టం చేస్తోంది. చర్చలు విఫలమైతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరు దేశాలు హెచ్చరించుకుంటున్నాయి. తమ షరతులను తిరస్కరిస్తే ఇరాన్‌లోని ప్రతి వంతెనను, పవర్ ప్లాంట్‌ను ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. దీనికి ప్రతిగా, అమెరికా తమ పౌర మౌలిక సదుపాయాలపై దాడి చేస్తే, గల్ఫ్ దేశాల్లోని పవర్ స్టేషన్లు, డీశాలినేషన్ ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ ప్రతిస్పందించింది.

ఇస్లామాబాద్‌లో భారీ ఏర్పాట్లు

మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఈ కీలక చర్చలకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. చర్చల నేపథ్యంలో ఇస్లామాబాద్ వ్యాప్తంగా దాదాపు 20,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించినట్లు అధికారులు తెలిపారు. ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చర్చలు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాయో వేచి చూడాలి.

## తెలంగాణలో ఆర్టీసీ సమ్మె సైరన్.. నేటి అర్ధరాత్రి నుంచి బస్సులు బంద్!

తీసుకున్నాయి. ప్రభుత్వం నుంచి చర్చలకు అధికారిక ఆహ్వానం, డిమాండ్లపై స్పష్టమైన హామీ రాకపోవడంతో సమ్మెకే మొగ్గు చూపుతున్నట్లు ఆర్టీసీ ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) ప్రకటించింది. జేఏసీతో పాటు ఇతర కార్మిక సంఘాలు సైతం సమ్మెకు మద్దతు ఇవ్వడంతో ఆర్టీసీలోని దాదాపు అన్ని యూనియన్లు ఇందులో పాలుపంచుకోనున్నాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా బస్సు సర్వీసులపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం తన నివాసంలో ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమ్మె మరో సకల జనుల సమ్మెగా మారుతుందని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఈదురు వెంకన్న అన్నారు. “ప్రైవేటు సిబ్బందితో బస్సులు నడపాలని చూస్తే ఎలా అడ్డుకోవాలో మాకు తెలుసు. సమ్మెను విజయవంతం చేసి సమస్యలను పరిష్కరించుకుంటాం“ అని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నంలోగా ప్రభుత్వం స్పందించకపోతే తాము కూడా సమ్మెలో పాల్గొంటామని తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అశ్వత్థామ రెడ్డి తెలిపారు.

# రేవంత్ రెడ్డి ‘యూ-టర్న్’ తీసుకున్నారు..

గోదావరిలో కొట్టుకుపోయిందని విమర్శించిన రేవంత్... ఇప్పుడు దానిపై ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని అప్పట్లో గగ్గోలు పెట్టి, ఇప్పుడు సీబీఐకి కేవలం 9 వేల కోట్ల స్కామ్ జరిగిందని అర్థం లేని లేఖ రాయడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్నించారు. అసలు ఏ ఆధారాలను బట్టి సీబీఐ విచారణ చేపట్టాలో సీఎం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరిపై అయినా ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు చర్యలు తీసుకుందా? అని బండి సంజయ్ నిలదీశారు. ఒక్కో మోటారుకు వందల కోట్లు ఖర్చు చేసి విదేశాల నుంచి తెచ్చారని, ఈ అవినీతి అంతా బయటకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు గతంలో కేసీఆర్‌కు ఏటీఎంలా ఉంటే, ఇప్పుడు కాంగ్రెస్‌కు కూడా అలాగే మారిందని సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ గతంలో పొత్తులు పెట్టుకున్న చరిత్రను గుర్తు చేస్తూ... బీజేపీపై తప్పుడు ప్రచారం చేయవద్దని హితవు పలికారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలకు తీరని అన్యాయం చేశారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కేవలం సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీలకు పదవులు ఇస్తే సరిపోతుందా? అని ప్రశ్నిస్తూ సెటైర్లు వేశారు. డీలిమిటేషన్ ప్రక్రియను అడ్డుకుని దక్షిణాదికి అన్యాయం చేస్తోంది రేవంత్, తమిళనాడు సీఎం స్టాలిన్ అని దుయ్యబట్టారు. ప్రస్తుత సీఎం, మాజీ సీఎంల భాష చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.

## దక్షిణాదిపై వివక్ష.. డీలిమిటేషన్ ప్రజాస్వామ్యంపై దాడి

తాము దీన్ని వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో విపక్షాలన్నీ ఏకతాటిపై ఉన్నాయని స్పష్టం చేశారు. సీఎం స్టాలిన్ తమిళనాడులో అద్భుతమైన పాలన అందిస్తున్నారని, మంచి చేసే వారికి ఎప్పుడూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. తమిళనాడులో బీజేపీకి అసలు ఉనికే లేదని, ఆ పార్టీకి ఓటు వేయవద్దని కోరారు. ఢిల్లీ లిక్కర్ కేసు విచారణ చేస్తున్న జస్టిస్ స్వర్ణ కాంత శర్మను ఆ బాధ్యతల నుంచి తప్పించాలని కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. దీనిపై స్పందిస్తూ... ప్రస్తుతం తాను తమిళనాడు ప్రచారంలో ఉన్నానని, ఢిల్లీకి తిరిగి వెళ్లాక కోర్టు ఉత్తర్వులను క్షుణ్ణంగా చదువుతానని చెప్పారు. ఇప్పటికే తన వాదనలను కోర్టులో వినిపించానని, తీర్పుపై అంతకుమించి వ్యాఖ్యానించలేనని పేర్కొన్నారు.

నినాదం
తెలుగు దిన పత్రిక
నిఖార్సైన జర్నలిజం
EVENING 6 PM
డిజిటల్ ఎడిషన్
మంగళవారం ఏప్రిల్ 21 2026
ninadam.in



# సముద్ర తాబేళ్ల సంరక్షణకు రాష్ట్రస్థాయి కమిటీ..

## ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

- మత్స్యకారులు, స్వచ్ఛంద సంస్థలు, శాస్త్రవేత్తలకు కమిటీలో చోటు




**అమరావతి, ఏప్రిల్ 21 (నినాదం):**

ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. వీటి పరిరక్షణ చర్యలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. గతేడాది డిసెంబర్ 17న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, అన్ని తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తాబేళ్ల సంరక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్) సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ జీవో ఆర్టీ నెం. 45ను విడుదల చేసింది. ఈ కమిటీకి రాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మత్స్యశాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు అటవీ శాఖ, కోస్టల్ సెక్యూరిటీ గ్రూప్, కోస్ట్ గార్డ్ ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. ముఖ్యంగా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకునేందుకు మెకనైజ్డ్ బోట్ల యజమానుల సంఘం, సంప్రదాయ మత్స్యకార సంఘాల ప్రతినిధులకు కమిటీలో స్థానం కల్పించారు. వీరితో పాటు తాబేళ్ల సంరక్షణలో అనుభవం ఉన్న ట్రీ ఫౌండేషన్, టర్టిల్ యాక్షన్ గ్రూప్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) నుంచి నిపుణులను కూడా సభ్యులుగా నియమించారు. పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించారు.

# ఏపీలో మున్సిపల్ కార్మికుల సమ్మె..
# నిలిచిపోనున్న పారిశుద్ధ్య సేవలు

- జీతాల కోసం సమ్మెకు దిగిన మున్సిపల్ కార్మికులు,
- మార్చి నెల జీతాలు రాకపోవడమే ప్రధాన కారణం,
- పదవీ విరమణ వయసు పెంపు సహా ఇతర డిమాండ్లు,
- రాష్ట్రవ్యాప్తంగా పారిశుద్ధ్య సేవలు నిలిచిపోయే ప్రమాదం,
- స్పష్టమైన హామీ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదని స్పష్టీకరణ


**అమరావతి, ఏప్రిల్ 21 (నినాదం):**



ఏపీలో మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారు. మార్చి నెల జీతాలు ఇప్పటికీ అందకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ్టి నుంచి సమ్మె చేస్తున్నట్లు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రకటించింది. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగుతుందని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి. సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల రెండు నుంచి నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు. మార్చి నెల జీతాల చెల్లింపులో సాంకేతిక సమస్య తలెత్తిందని అధికారులు చెబుతున్నా, పురపాలకశాఖ మంత్రితో చర్చించినా పరిష్కారం కాలేదని కార్మిక సంఘాల నేతలు తెలిపారు. జీతాలతో పాటు మరికొన్ని కీలక డిమాండ్లను కూడా కార్మికులు ప్రభుత్వం ముందుంచారు. పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, మరణించిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం లో విఫలమైందని వారు విమర్శిస్తున్నారు. కార్మికుల సమ్మెతో రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. చెత్త సేకరణ, డ్రైనేజీ నిర్వహణ వంటి సేవలకు అంతరాయం కలగనుం ది. ప్రభుత్వం వెంటనే తమను చర్చలకు పిలిచి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. స్పష్టమైన హామీ లభించే వరకు విధులకు హాజరయ్యేది లేదని వారు స్పష్టం చేశారు.

# సివిల్ సర్వీసెస్ డే శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం
- సమర్థవంతమైన, పారదర్శక, పౌర కేంద్రీకృత పాలన అందించాలని పిలుపు
- విధానాలు క్షేత్రస్థాయిలో చివరి వ్యక్తి వరకు చేరాలని స్పష్టీకరణ
- ప్రజలకు ప్రయోజనం చేకూరినప్పుడే పరిపాలన బలోపేతం అవుతుందని వ్యాఖ్య




**అమరావతి, ఏప్రిల్ 21 (నినాదం):**

జాతీయ సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సివిల్ సర్వెంట్లకు శుభాకాంక్షలు తెలిపారు. సమర్థవంతమైన, పారదర్శక, పౌర కేంద్రీకృత పాలనను అందించడంలో వారి బాధ్యతను ఈ రోజు గుర్తుచేస్తుందని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి పౌరుడికి అభివృద్ధి ఫలాలు చేరినప్పుడే పాలనకు సార్థకత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో స్పందించారు. "సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా దేశంలోని సివిల్ సర్వెంట్లందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు. పరిపాలనను సమర్థవంతంగా, పారదర్శకంగా, పౌర కేంద్రంగా నడిపించడంలో మీరు మోస్తున్న గొప్ప బాధ్యతను ఈ రోజు మనందరికీ గుర్తుచేస్తుంది. ఈ సంవత్సరం మనం ఎంచుకున్న థీమ్, "వికసిత్ భారత్: పౌర కేంద్రక పాలన, అట్టడుగు స్థాయి వరకు అభివృద్ధి". ఇది మన ముందున్న ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశిస్తోంది. అభివృద్ధి అనేది కేవలం విధానాలకే పరిమితం కాకూడదు. అది ప్రతి ఇంటికి, ప్రతి పౌరుడికి సకాలంలో, సమర్థవంతంగా చేరినప్పుడే దానికి సార్థకత చేకూరుతుంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు మేలు చేసే స్థిరమైన ఫలితాలపైనే మన పరిపాలనా వ్యవస్థ యొక్క నిజమైన బలం ఆధారపడి ఉంటుంది. ఈ బృహత్తర ప్రయత్నంలో సివిల్ సర్వెంట్లుగా మీ పాత్ర అత్యంత కీలకమైనది. ప్రభుత్వ విధానాలను ఆచరణలోకి తీసుకురావడంలో, పాలనా వ్యవస్థలను మెరుగుపరచడంలో, జవాబుదారీతనాన్ని నిలబెట్టడంలో మీరు చేస్తున్న కృషి అమూల్యమైనది. మీ క్రమశిక్షణ, నిబద్ధత, అంకితభావం దేశ పురోగతికి అర్థవంతమైన సేవలందిస్తూనే ఉన్నాయి. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ వికసిత్ భారత్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు.

# నన్ను ఉద్యోగం నుంచి తొలగించడం తప్పని
# ప్రతి ఐఏఎస్ అధికారికీ తెలుసు..

- ఏపీ ఉద్యోగులతో బీజేపీకి వ్యతిరేకంగా చంద్రబాబు ప్రచారం చేయించారన్న వెంకట్రామిరెడ్డి
- ప్రధాని మోదీని తిట్టించారని ఆరోపణ
- ఉద్యోగుల పట్ల జగన్ చాలా హుందాగా వ్యవహరించారని వ్యాఖ్య

**అమరావతి, ఏప్రిల్ 21 (నినాదం):**



ప్రభుత్వం తనను ఉద్యోగం నుంచి తొలగించడాన్ని ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తప్పుబట్టారు. ఇది కేవలం ఉద్యోగులను భయపెట్టడానికి చేస్తున్న చర్య అని మండిపడ్డారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వంపై, గతంలో చంద్రబాబు నాయుడు వ్యవహరించిన తీరుపై సంచలన ఆరోపణలు చేశారు. గతంలో చంద్రబాబు ఏపీ ఉద్యోగులను కర్ణాటకకు తీసుకెళ్లి బీజేపీకి వ్యతిరేకంగా ప్రచారం చేయించారని, ప్రధాని మోదీని తిట్టించారని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగులను రాజకీయంగా వాడుకున్న చరిత్ర చంద్రబాబుదేనని అన్నారు. తాను ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయలేదని గతంలో అధికారులే రిపోర్ట్ ఇచ్చారని, తనను తొలగించడం తప్పని ప్రతి ఐఏఎస్ అధికారికి తెలుసని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల పట్ల జగన్ చాలా హుందాగా వ్యవహరించారని, కూటమి ప్రభుత్వం కంటే వైసీపీ ప్రభుత్వం 100 రెట్లు మేలు చేసిందని కొనియాడారు. జగన్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల కోసం కూటమి ప్రభుత్వం ఏం చేసిందని ఆయన నిలదీశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 15వ తేదీ దాటినా జీతాలు రావడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. కాగా, ఏపీ పంచాయతీరాజ్ శాఖలో అసిస్టెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న వెంకట్రామి రెడ్డి గత వైసీపీ పార్టీకి ప్రచారం చేశారన్న ఆరోపణతో నిన్న ప్రభుత్వం ఆయనను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఏపీలో 225, తెలంగాణలో 153..

- ఏపీ, తెలంగాణలో ప్రత్యేక నియోజకవర్గాల పునర్విభజనపై ఈసీ పరిశీలన
- ఆర్టికల్ 170 సవరణ అవసరమని గతంలో స్పష్టం చేసిన సుప్రీం కోర్టు
- జాతీయ డీలిమిటేషన్ బిల్లు రాకపోతేనే ప్రత్యేక పునర్విభజనకు అవకాశం
- 2026 జనాభా లెక్కల తర్వాతే పెంపు ఉంటుందని గతంలో కేంద్రం వెల్లడి




**ఢిల్లీ, ఏప్రిల్ 21 (నినాదం):**

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రత్యేకంగా ఈ రెండు రాష్ట్రాల్లోనే సీట్లు పెంచే విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దీంతో విభజన హామీ అయిన సీట్ల పెంపుపై తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014 ప్రకారం, ఏపీలో అసెంబ్లీ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణలో 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. అయితే, 2026 తర్వాత జరిగే తొలి జనాభా గణన అనంతరమే దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన ఉంటుందని కేంద్ర ప్రభుత్వం గతంలోనే స్పష్టం చేసింది. దీనికితోడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 170కి అనుగుణంగా విభజన చట్టంలోని సెక్షన్ 26ను సవరించకుండా సీట్ల పెంపు సాధ్యం కాదని సుప్రీం కోర్టు కూడా గతంలో ఓ తీర్పులో పేర్కొంది.

ఈ రాజ్యాంగపరమైన చిక్కుముడి వల్లే ఇన్నాళ్లు ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ కోసం కేంద్రం ఓ కొత్త బిల్లును తీసుకురావాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆరు నెలల్లో ఈ బిల్లును పార్లమెంటు ముందుకు తెస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఒకవేళ ఆ జాతీయ బిల్లు రావడం ఆలస్యమైతే, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారమే తెలుగు రాష్ట్రాల్లో సీట్లు పెంచేందుకు ఉన్న అవకాశాలను ఈసీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఏపీలో ఉద్యోగుల స్థానికతపై అమల్లోకి కొత్త రూల్స్..

- 1975 నాటి ఉత్తర్వుల స్థానంలో 2025 పేరుతో కొత్త నిబంధనలు
- డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో 95 శాతం పోస్టులు స్థానికులకే రిజర్వ్
- 26 జిల్లాల ప్రాతిపదికన జిల్లా, జోనల్, మల్టీ-జోనల్ కేడర్ల పునర్వ్యవస్థీకరణ
- కేడర్ల మార్పు ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి 27 నెలల గడువు

**అమరావతి, ఏప్రిల్ 21 (నినాదం):**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్లు, నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. 1975 నాటి పాత విధానాన్ని రద్దు చేస్తూ, "ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్, 2025" పేరుతో జారీ అయిన కొత్త రాష్ట్రపతి ఉత్తర్వులను ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 26 జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ కొత్త ఉత్తర్వుల ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగాల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో 95 శాతం పోస్టులను స్థానిక అభ్యర్థులకే రిజర్వ్ చేయనున్నారు. జిల్లా, జోనల్, మల్టీ-జోనల్ కేడర్ పోస్టులకు ఈ నిబంధన వర్తిస్తుంది. "స్థానిక అభ్యర్థి" నిర్వచనాన్ని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. సంబంధిత అర్హత పరీక్షకు హాజరైన విద్యా సంవత్సరంతో ముగిసేలా, వరుసగా నాలుగు విద్యా సంవత్సరాలు స్థానిక ప్రాంతంలోని విద్యాసంస్థలో చదివిన వారిని లోకల్ అభ్యర్థిగా పరిగణిస్తారు. కొత్త విధానం ప్రకారం కేడర్లను మూడు స్థాయిలుగా వర్గీకరించారు. జూనియర్ అసిస్టెంట్, తత్సమాన స్థాయి పోస్టులను జిల్లా కేడర్‌గా, ఆపై సూపరింటెండెంట్, ఫస్ట్-లెవల్ గెజిటెడ్ స్థాయి పోస్టులను జోనల్ కేడర్‌గా, డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు ఉన్న పోస్టులను మల్టీ-జోనల్ కేడర్‌గా నిర్ధారించారు. ఈ కొత్త నిబంధనలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ సివిల్ పోస్టులను స్థానిక కేడర్లుగా విభజించే ప్రక్రియను 27 నెలల్లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ అయ్యాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి కింద ఈ కొత్త ఉత్తర్వులను అమలు చేస్తున్నారు.

# అంబటి రాంబాబుపై
# మరో కేసు నమోదు

- ఇప్పటికే రెండు కేసుల్లో 17 రోజుల పాటు రిమాండ్‌లో ఉన్న అంబటి



**అమరావతి, ఏప్రిల్ 21 (నినాదం):**

వైఎసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. సత్తెనపల్లి లక్కీడ్రా, ముఖ్యమంత్రి చంద్రబాబుపై వ్యాఖ్యల కేసుల నుంచి ఇప్పుడిప్పుడే కొంత రిలాక్స్ అవుతున్న ఆయనపై మరో కొత్త కేసు నమోదైంది. కేసు వివరాల్లోకి వెళితే... తన ఇంటిపై జరిగిన దాడికి నిరసనగా, దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన గుంటూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షే ఇప్పుడు ఆయనపై మరో కేసు నమోదుకు దారితీసింది. ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశంలో దీక్ష నిర్వహించడమే కాకుండా, తద్వారా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారనే ఆరోపణలతో నగరంపాలెం పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఇప్పటికే సత్తెనపల్లి లక్కీడ్రా ఉదంతం, చంద్రబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యల కేసుల్లో అంబటి రాంబాబు 17 రోజుల పాటు రిమాండ్‌లో ఉండి, బెయిల్‌పై విడుదలయ్యారు. బయటకు వచ్చిన కొన్ని రోజులకే నిరసన దీక్ష పేరిట నిబంధనలు ఉల్లంఘించారంటూ ఆయనపై మళ్లీ కేసు నమోదు కావడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కొత్త కేసు నమోదు కావడంపై అంబటి ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# వైసిపి రాజకీయ పార్టీ కానేకాదు

- రాజకీయ హత్యలకు డెన్‌గా మారింది
- పార్టీ అనుమతులపై ఇసి ఆలోచన చేయాలి
- దస్తగిరి హత్యతో వైసిపి నైజం మరింత బయటపడింది
- మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు



**అమరావతి, ఏప్రిల్ 21(నినాదం):**

వైసీపీ రాజకీయ పార్టీ కాదని.. హత్య రాజకీయాలకు డెన్‌గా తయారైందని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత వైసీపీకి లేదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ అనుమతులపైన ఎలక్షన్ కమిషన్ కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనక ఆ పార్టీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పార్టీ చేసిందని విమర్శించారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. చీకట్లో చంపడం.. పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి ఇంట్లో వందల కోట్ల విలువ చేసే డాక్యుమెంట్లు దొరికాయని మంత్రి కొలుసు పార్థసారథి ప్రస్తావించారు. జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లు, హత్యకు గురైన పెద్ద దస్తగిరి ఇంట్లో ఎలా లభించాయని ప్రశ్నించారు. హత్యకు గురైన పెద్ద దస్తగిరి.. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్యుడని చెప్పుకొచ్చారు. ఆస్తులు, అధికారం కోసం వైసీపీ నేతలు ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి, పెద్ద దస్తగిరి హత్య వరకు వైసీపీ ఒకే తరహా నాటకమాడుతోందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి హత్యకు ప్రధాన కారకులైన వారు.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన పాపాలను ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వైసీపీని ఒక రాజకీయ పార్టీగా ప్రజలు చూడటం లేదని.. రాజకీయాల్లో కొనసాగే అర్హత ఆ పార్టీకి లేదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ధనదాహం, అధికారదాహానికి ఎవరు అడ్డొచ్చినా తల్లైనా, చెల్లైనా, బాబాయ్ అయినా ఎవరైనా ఒకటేనని ఎద్దేవా చేశారు. జగన్ క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారనే విషయాన్ని.. వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాలని అన్నారు. పెద్ద దస్తగిరి హత్య, బాబాయ్ హత్య, జగన్ కారు చక్రాల కింద నలిగిన కార్యకర్త ఇలా ఎన్నో ఉదాహరణలు జగన్ నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి సొంత పార్టీకి చెందిన దస్తగిరిని హత్య చేయటం జగన్ స్వార్థాన్ని తెలుపుతోందన్నారు. తాడేపల్లిలో తనకున్న అనుబంధంలో భాగంగానే దస్తగిరి హత్య జరిగిందని ఆరోపించారు. హింసా రాజకీయాలు నడిపే వారికి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. వైసీపీకి ఏపీలో చోటు లేకుండా చేయాలని మంత్రి సూచించారు.

# తమిళనాడు తీరప్రాంతానికి వర్షహెచ్చరిక

**చెన్నై, ఏప్రిల్ 21(నినాదం):**

తమిళనాడు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల తీరప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు చెన్నై ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ఉత్తర కర్ణాటక నుంచి రాష్ట్రం మీదుగా మన్నార్‌వలైకుడ వరకు ఉపరితల ఆవర్తనం నెలకొంది. ఈ కారణం గా, పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాలు, దక్షిణ జిల్లాల సముద్రీతీరప్రాంతాల్లో మంగళ, బుధవారా ల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. తూణరాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుంది. రాష్ట్రంలోని అంతర్ జిల్లాల్లో ఈ నెల 23వ తేది వరకు ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటూ గరిష్ట ఉష్ణోగ్రత 37 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

## అక్షయ తృతీయ ఎఫెక్ట్...
## తిరుమల శ్రీవారి డాలర్లకు విపరీతమైన డిమాండ్

- రెండ్రోజుల్లో రికార్డు స్థాయిలో రూ.1.10 కోట్ల అమ్మకాలు




**తిరుమల, ఏప్రిల్ 21 (నినాదం):**

అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బంగారు డాలర్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో జరిగాయి. ఈ శుభ సందర్భంగా రెండ్రోజుల వ్యవధిలో ఏకంగా రూ.1.10 కోట్ల విలువైన డాలర్లను భక్తులు కొనుగోలు చేశారు. బహిరంగ మార్కెట్‌లో బంగారం ధరలు అధికంగా ఉన్నప్పటికీ, భక్తి విశ్వాసాలతో భక్తులు డాలర్ల కొనుగోలుకు మొగ్గు చూపారు. అక్షయ తృతీయ శుభ ముహూర్తం ఆదివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ఉండటంతో, ఈ రెండు రోజుల్లో అమ్మకాలు భారీగా నమోదయ్యాయి. అందిన సమాచారం ప్రకారం, ఆదివారం రూ.70 లక్షలు, సోమవారం రూ.40 లక్షల విలువైన బంగారు డాలర్లను టీటీడీ విక్రయించింది. గతేడాది అక్షయ తృతీయ నాడు సుమారు రూ.90 లక్షల అమ్మకాలు జరగ్గా, ఈసారి ఆ రికార్డును అధిగమించడం విశేషం. అక్షయ తృతీయ రోజున శ్రీవారి ప్రతిమ ఉన్న బంగారు డాలరు కొనుగోలు చేస్తే శుభం కలుగుతుందని, సిరిసంపదలు వృద్ధి చెందుతాయని భక్తులు నమ్ముతుంటారు. ఈ నమ్మకంతోనే తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న టీటీడీ విక్రయ కేంద్రం వద్ద భక్తులు బారులు తీరి డాలర్లను కొనుగోలు చేశారు. బంగారు డాలర్లతో పాటు వెండి, రాగి డాలర్లను కూడా టీటీడీ భక్తులకు అందుబాటులో ఉంచింది.

## వైరా-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవేపై
# టోల్ వసూళ్లు ప్రారంభం

- వైరా వద్ద టోల్‌గేట్‌ను ప్రారంభించిన ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య

**హైదరాబాద్ ఏప్రిల్ 21 (నినాదం):**

తెలంగాణలోని వైరా నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లిని కలిపే నూతన గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిపై నిన్నటి నుంచి టోల్ వసూళ్లు అధికారికంగా ప్రారంభమయ్యాయి. వైరా వద్ద ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌లను ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య లాంఛనంగా ప్రారంభించడంతో వాహనాల నుంచి రుసుము వసూలు మొదలైంది. ఈ రహదారిపై ప్రయాణించిన దూరానికి మాత్రమే టోల్ చెల్లించే విధానాన్ని అమలు చేస్తున్నారు. తెలంగాణ పరిధిలోని 33వ కిలోమీటర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా పొంగుటూరు వరకు (149 కి.మీ.) ప్రయాణించే వాహనాలకు ఈ టోల్ ఛార్జీలు వర్తిస్తాయి. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన ఈ కొత్త మార్గం వల్ల హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులకు సుమారు 50 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీంతో ప్రయాణ సమయం కూడా గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు తెలిపారు. అయితే, వేగవంతమైన ప్రయాణానికి వీలుగా నిర్మించిన ఈ రహదారిపై భద్రతా కారణాల దృష్ట్యా కొన్ని నిబంధనలు విధించారు. ఈ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్ల ప్రయాణానికి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను నిర్మించారు.

## ఏడు రోజుల కీలక పర్యటనకు గాను
## సింగపూర్ చేరుకున్న ఏపీ మంత్రుల బృందం

- నేటి నుంచి ఈ నెల 27 వరకు కొనసాగనున్న మంత్రుల సింగపూర్ పర్యటన




**అమరావతి, ఏప్రిల్ 21 (నినాదం):**

ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వానికి చెందిన ఏడుగురు మంత్రుల బృందం ఈ ఉదయం సింగపూర్ చేరుకుంది. రాష్ట్రంలో ఆధునిక పరిపాలన, ఉత్తమ పాలనా పద్ధతులను ప్రవేశపెట్టడమే లక్ష్యంగా ఈ నెల 27వ తేదీ వరకు, అంటే మొత్తం ఏడు రోజుల పాటు ఈ పర్యటన కొనసాగనుంది. మంత్రుల బృందం ఈ ఉదయం సింగపూర్ చేరుకోగానే, అక్కడి తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. మంత్రులు అచ్చెన్నాయుడు, పి. నారాయణ, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్ ఈ బృందంలో ఉన్నారు. వరల్డ్ బ్యాంక్, సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటైన 'సింగపూర్-ఏపీ జాయింట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ వరల్డ్ క్లాస్' (రా+జీ×ఔజ) ఒప్పందంలో భాగంగా మంత్రులు పలు శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ముఖ్యంగా 'నేషన్ ఫస్ట్' వంటి నాయకత్వ సూత్రాలు, రాజకీయ జవాబుదారీతనం, పారదర్శక పాలనపై నిర్వహించే 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' (ïశీ) సెషన్లలో మంత్రులు కీలక విషయాలను తెలుసుకోనున్నారు. మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ ప్రణాళిక, ప్రజా సేవల నిర్వహణలో సింగపూర్ అనుసరిస్తున్న విజయవంతమైన విధానాలను మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. సింగపూర్ పాలనా నమూనాను అధ్యయనం చేసి, వాటిని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అన్వయించుకోవడం ద్వారా రాష్ట్ర పరిపాలనలో విప్లవాత్మక మార్పులు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పర్యటన ముగిసిన అనంతరం రాష్ట్ర కేబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# నినాదం

తెలుగు దిన పత్రిక

నిఖార్సైన జర్నలిజం

EVENING 6 PM

04

డిజిటల్ ఎడిషన్

మంగళవారం ఏప్రిల్ 21 2026

ninadam.in


## ఆపిల్‌లో కొత్త శకం..
# 15 ఏళ్ల తర్వాత తప్పుకున్న సీఈవో టిమ్ కుక్

- ఆపిల్ కొత్త సీఈవోగా జాన్ టెర్నస్ నియామకం,
- ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కొనసాగనున్న టిమ్ కుక్
- ప్రస్తుతం హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ హెడ్‌గా ఉన్న టెర్నస్,
- సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్న మార్పులు



**ఢిల్లీ, ఏప్రిల్ 21 (నినాదం):** టెక్ దిగ్గజం ఆపిల్‌లో ఒక శకం ముగిసింది. 15 ఏళ్లుగా కంపెనీ సీఈవోగా వ్యవహరిస్తున్న టిమ్ కుక్ తన పదవి నుంచి తప్పుకుంటున్నట్టు సంస్థ ప్రకటించింది. ఆయన స్థానంలో కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (సీఈవో) జాన్ టెర్నస్‌ను నియమించింది. ఈ మార్పులు ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. సీఈవో పదవి నుంచి వైదొలగినప్పటికీ, టిమ్ కుక్ కంపెనీకి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా సేవలు అందించనున్నారు. 50 ఏళ్ల జాన్ టెర్నస్ గత 25 ఏళ్లుగా ఆపిల్‌తో అనుబంధం కలిగి ఉన్నారు. 2001లో కంపెనీలో చేరిన ఆయన, ప్రస్తుతం హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగాధిపతిగా కొనసాగుతున్నారు. మ్యాక్స్, ఐప్యాడ్స్, ఎయిర్‌పాడ్స్ వంటి విజయవంతమైన ఉత్పత్తుల రూపకల్పనలో టెర్నస్ తెరవెనుక కీలక పాత్ర పోషించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) రంగంలో ఎన్విడియా, మెటా వంటి సంస్థల నుంచి తీవ్రమైన పోటీ ఎదురవుతున్న తరుణంలో ఈ నాయకత్వ మార్పు ప్రాధాన్యం సంతరించుకుంది. ఐఫోన్లలో ఏఐని మరింత సమర్థంగా చేయడంతో పాటు, ఫోల్డబుల్ ఫోన్లు, స్మార్ట్ గ్లాసెస్ వంటి కొత్త తరం ఉత్పత్తులపై టెర్నస్ దృష్టి సారిస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే, ఆపిల్ తన సిరి కోసం గూగుల్ జెమినీ ఏఐ మోడల్‌ను వినియోగించుకునేందుకు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. 2011లో స్టీవ్ జాబ్స్ అనారోగ్యంతో తప్పుకున్న తర్వాత టిమ్ కుక్ ఆపిల్ సీఈఓగా బాధ్యతలు చేపట్టారు. ఆయన హయాంలో కంపెనీ మార్కెట్ విలువ 3.6 ట్రిలియన్ డాలర్లకు పైగా పెరిగింది. తాజా మార్పుల్లో భాగంగా, జానీ స్రౌజీని చీఫ్ హార్డ్‌వేర్ ఆఫీసర్‌గా నియమించారు.

## ఈశాన్యంలో భూకంపం.. పలు రాష్ట్రాల్లో ప్రకంపనలు

- మణిపూర్‌లోని కామ్‌జాంగ్ కేంద్రంగా 5.2 తీవ్రతతో ప్రకంపనలు
- అస్సాం, నాగాలాండ్, మేఘాలయలోనూ కంపించిన భూమి
- భూమికి 62 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం
- ప్రాణ, ఆస్తి నష్టం లేదని తెలిపిన అధికారులు

**ఢిల్లీ, ఏప్రిల్ 21 (నినాదం):** ఈశాన్య రాష్ట్రాలను మరోసారి భూప్రకంపనలు వణికించాయి. ఈరోజు ఉదయం మణిపూర్ కేంద్రంగా భూకంపం సంభవించింది. దీని ప్రభావంతో మణిపూర్‌తో పాటు నాగాలాండ్, అస్సాం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భూమి కంపించింది. తెల్లవారుజామున ప్రజలంతా నిద్రలో ఉండగా ఈ ఘటన జరగడంతో భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం, ఈరోజు ఉదయం 5:59 గంటలకు ఈ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.2గా నమోదైంది. భూకంప కేంద్రం మణిపూర్‌లోని కామ్‌జాంగ్ జిల్లాలో, భూమికి 62 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. భూకంపం కారణంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం లేదని స్థానిక అధికారులు వెల్లడించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయినప్పటికీ, ఈశాన్య ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తుండటంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ, సహాయక బృందాలను అప్రమత్తం చేశారు.

## ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ దినోత్సవం



**మంచిర్యాల, ఏప్రిల్ 21(నినాదం):** నస్పూర్ పట్టణంలోని మదర్స్ ప్రైడ్ ప్లే స్కూల్లో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# శాంతి చర్చలకు అమెరికా చర్యలే అడ్డంకి

- తమ నౌకను స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ విదేశాంగ మంత్రి ఆగ్రహం
- తదుపరి విడత చర్చల్లో పాల్గొనడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని వెల్లడి
- అమెరికా ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని ఇరాన్ విమర్శ
- పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరు దేశాల మధ్య తొలి విడత చర్చలు



**టెహ్రాన్, ఏప్రిల్ 21 (నినాదం):** అమెరికా చేపడుతున్న రెచ్చగొట్టే చర్యలు, కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లంఘనలు ఇరు దేశాల మధ్య శాంతి చర్చల కొనసాగింపునకు పెను ఆటంకంగా మారాయని ఇరాన్ తీవ్రంగా హెచ్చరించింది. అమెరికా తన వైఖరిని మార్చుకోకపోతే చర్చల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చీ ఈ మేరకు పాకిస్థాన్, రష్యా విదేశాంగ మంత్రులతో వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్‌కు చెందిన 'టౌస్కా' అనే కంటైనర్ నౌకను, దాని సిబ్బందిని అమెరికా అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వాషింగ్టన్ నుంచి వైరుధ్యపూరిత ప్రకటనలు, బెదిరింపులు వస్తున్నాయని ఆరోపించారు. 40 రోజుల భీకర పోరు తర్వాత ఏప్రిల్ 8న ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఏప్రిల్ 11, 12 తేదీల్లో ఇస్లామాబాద్‌లో తొలి విడత చర్చలు జరిగాయి. అయితే, అమెరికా తీరు కారణంగా తదుపరి విడత చర్చల్లో పాల్గొనడంపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బకాయి తెలిపారు. అమెరికా ఒకవైపు దౌత్యం అంటున్నప్పటికీ, మరోవైపు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీతో పాటు పలువురు సీనియర్ కమాండర్లు, పౌరులు మరణించారు. దీనికి ప్రతిగా ఇరాన్.. ఇజ్రాయెల్, మధ్యప్రాచ్యంలోని అమెరికా స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసిన విషయం తెలిసిందే.

# తుపాకీ కాల్పులు.. కత్తులతో దాడి..
## రణరంగంగా మారిన జర్మనీ గురుద్వారా

- జర్మనీలోని ఓ గురుద్వారాలో రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ
- కత్తులు, తుపాకీతో దాడి.. 11 మందికి గాయాలు
- ఆధిపత్య పోరు, నిధుల వివాదమే కారణమని పోలీసుల అనుమానం
- రంగంలోకి దిగిన ప్రత్యేక పోలీసు బృందాలు.. ఒకరి అరెస్ట్



**ఢిల్లీ, ఏప్రిల్ 21 (నినాదం):** జర్మనీలోని మోయెర్స్ నగరంలో ఉన్న ఓ గురుద్వారాలో రెండు వర్గాల మధ్య హింసాత్మక ఘర్షణ చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ ఘటనలో కనీసం 11 మంది గాయపడ్డారు. గురుద్వారాలో ఆధిపత్యం, నిధుల నియంత్రణ వంటి అంశాలే ఈ ఘర్షణకు దారితీసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

**అసలేం జరిగిందంటే..!**

ప్రార్థనా మందిరంలో రెండు గ్రూపుల మధ్య మాటామాటా పెరిగి అది కాస్తా తీవ్ర ఘర్షణకు దారితీసింది. దాదాపు 40 మంది ఈ గొడవలో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు కత్తులు, కిర్పాన్ల వంటి పదునైన ఆయుధాలతో దాడి చేసుకున్నారు. కొందరు పెప్పర్ స్ప్రే కూడా ఉపయోగించారు. ఘర్షణకు సంబంధించిన భయానక దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, ప్రత్యేక వ్యూహాత్మక విభాగాలు సహా భారీ ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కొత్త డైరెక్టర్ల బోర్డు ఎన్నిక, గురుద్వారా నిధులపై నియంత్రణ వంటి విషయాల్లో మాజీ, ప్రస్తుత బోర్డు సభ్యుల మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నాయని, అవే ఈ దాడికి కారణమై ఉండవచ్చని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. "ఇది పక్కా ప్రణాళికతో జరిగిన దాడి. ప్రార్థనలు మొదలవడానికి ముందే దాడి చేసిన వారు పెప్పర్ స్ప్రే చల్లారు. వారిలో ఒకరు తుపాకీతో కాల్పులు జరపగా, మరికొందరు కత్తులతో దాడి చేశారు" అని ఓ వ్యక్తి వివరించారు. గాయపడిన వారికి అక్కడికక్కడే వైద్య సిబ్బంది చికిత్స అందించారు. ఎవరి ప్రాణానికీ ప్రమాదం లేదని అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఒక అనుమానితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో లభించిన తూటా కేసింగ్‌ల ఆధారంగా అది బ్లాంక్-ఫైరింగ్ పిస్టల్ అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. తుపాకీని ఇంకా స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ఈ ఘటనపై క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ విభాగం దర్యాప్తు చేస్తోంది.

## బీహార్ ఆసుపత్రిలో మున్నాభాయ్ ఎంబీబీఎస్..
# రోగికి కుట్లు వేసిన సెక్యూరిటీ గార్డు

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స అందిస్తుండగా ఘటన
- సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటం వల్లే ఇలా జరిగిందని ఆసుపత్రి వివరణ
- రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమంటూ తీవ్ర విమర్శలు
- భారీగా ఖాళీలు ఉన్నాయని గతంలోనే స్పష్టం చేసిన కాగ్ నివేదిక



**పాట్నా, ఏప్రిల్ 21 (నినాదం):** బీహార్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. వైద్య సిబ్బంది కొరత కారణంగా ఓ సెక్యూరిటీ గార్డు గాయపడిన రోగికి కుట్లు వేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పశ్చిమ చంపారన్ జిల్లాలోని బాగా సబ్-డివిజనల్ ఆసుపత్రిలోని మైనర్ ఆపరేషన్ థియేటర్‌లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఒక టెంపో, పికప్ వ్యాన్ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం బాగా ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో వైద్యులు లేదా నర్సులకు బదులుగా, ఒక సెక్యూరిటీ గార్డు రోగికి కుట్లు వేయడం వీడియోలో స్పష్టంగా కనిపించింది. గాయపడిన వసీం అక్తర్, సురేంద్ర పాసి అనే బాధితులు తమకు సెక్యూరిటీ గార్డే కుట్లు వేశాడని తెలిపారు. శిక్షణ లేని వ్యక్తితో చికిత్స చేయించడం తీవ్ర నిర్లక్ష్యమని, ఇది తమ ప్రాణాలకే ప్రమాదమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తీవ్ర దుమారం రేగడంతో ఆసుపత్రి యాజమాన్యం స్పందించింది. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ తివారీ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో చాలాకాలంగా సిబ్బంది కొరత ఉందని తెలిపారు. ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు, డ్రెస్సర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రమాదం జరిగిన రోజు ఒకేసారి చాలా మంది రోగులు రావడంతో, ఒకరికి తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో డాక్టర్ పర్యవేక్షణలోనే సెక్యూరిటీ గార్డు సహాయం తీసుకున్నామని వివరించారు. అయితే, ఈ ఘటన బీహార్ ఆరోగ్య వ్యవస్థలోని లోపాలను మరోసారి బయటపెట్టింది. 2016-2022 కాగ్ (జూా+) నివేదిక ప్రకారం, రాష్ట్రంలోని కీలక ఆరోగ్య విభాగాల్లో 49% పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ప్రకారం ప్రతి 1000 మందికి ఒక డాక్టర్ ఉండాల్సి ఉండగా, బీహార్‌లో 2,148 మందికి ఒకరే ఉన్నారని నివేదిక స్పష్టం చేసింది. ఈ తాజా ఘటనతో రాష్ట్రంలో వైద్య సేవలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోందని పలువురు విమర్శిస్తున్నారు.


# రేవంత్ రెడ్డి అడిగినా పాడను.. నా గొంతు కేసీఆర్‌కే సొంతం

- మళ్లీ కేసీఆర్ పాలన రావాలంటూ ఆకాంక్ష
- కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల కష్టాలు, కూల్చివేతలంటూ విమర్శలు
- సీఎం రేవంత్ రెడ్డి అడిగినా పాటలు పాడనని స్పష్టం చేసిన మధుప్రియ



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నినాదం):** ప్రముఖ జానపద గాయని, తెలంగాణ ఉద్యమ గళం మధుప్రియ మరోసారి తన రాజకీయ వైఖరిని కుండబద్దలు కొట్టారు. మాజీ సీఎం కేసీఆర్‌కు తాను ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తానని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరినా కాంగ్రెస్ ప్రభుత్వం కోసం పాటలు పాడనని స్పష్టం చేశారు. సోమవారం జగిత్యాలలో బీఆర్ఎస్ నిర్వహించిన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న ఆమె, తన గాత్రంతో సభికులను ఉర్రూతలూగించడమే కాకుండా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. జగిత్యాల సభలో మధుప్రియ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తన పాటలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా "మళ్లీ బాపు రావాలి.. మళ్లీ కేసీఆర్ పాలన రావాలి" అంటూ ఆమె పాడిన పాట సభలో మార్మోగింది. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలకు కేసీఆర్ అంటే ఒక ఎమోషన్ అని, రాష్ట్ర సాధనలో ఆయన పాత్రను ఎవరూ మరువలేరని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి కేసీఆర్‌తో తనకు విడదీయరాని అనుబంధం ఉందని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మధుప్రియ ఘాటుగా స్పందించారు. "కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రైతుల బాధలు, కూల్చివేతలు పెరిగిపోయాయి. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే తెలంగాణ బాగుంది. అందుకే మళ్లీ ఆయనే అధికారంలోకి రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ఆమె పేర్కొన్నారు. తాను ఎప్పటికీ కేసీఆర్ పక్షానే ఉంటానని పునరుద్ఘాటించారు. "నా వైఖరి స్పష్టం. నేను కేసీఆర్ సైన్యంలో ఒక సైనికురాలిని. రేవంత్ రెడ్డి గారు అడిగినా నేను కాంగ్రెస్ కోసం పాడను. నా గొంతు ఎప్పటికీ కేసీఆర్ కోసమే" అంటూ స్పష్టం చేశారు.

# సభ విజయవంతం పట్ల శ్రీధర్ బాబు ప్రత్యేక కృతజ్ఞతలు..



**భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 21(నినాదం):** కాటారం మండలం నస్తురుపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమానికి భారీగా హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల,ఇతర జిల్లాల ప్రజలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలు చూపిస్తున్న విశ్వాసం తమకు మరింత బాధ్యతను పెంచిందని మంత్రి పేర్కొన్నారు. అలాగే మంథని నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, మహిళా , యూత్ కాంగ్రెస్ శ్రేణులు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన జిల్లా అధికారులకు, సిబ్బందికి పోలీస్ శాఖ సిబ్బందికి మరియు డిఎస్ బి వాలంటీర్లకు, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు మంత్రి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వారి సమన్వయం, క్రమశిక్షణ వల్ల కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందని అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరి పాత్ర అభినందనీయమని మంత్రి అన్నారు. ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## నన్ను ఎవరూ లొంగదీసుకోలేరు

- తమిళ ప్రజలకు విజయ్ బహిరంగ లేఖ
- తమిళనాడులో నేటి సాయంత్రం ముగుస్తున్న ఎన్నికల ప్రచారం



**చెన్నై, ఏప్రిల్ 21 (నినాదం):** తమిళనాడు రాజకీయ రణరంగంలో ఇప్పుడు అసలైన వేడి మొదలైంది. ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం నేడు సాయంత్రంతో ప్రచారం ముగుస్తోంది. ఈ తరుణంలో, టీవీకే అధినేత విజయ్ తమిళ ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తనను ఎన్నో శక్తులు అడ్డుకోవాలని చూశాయని, కానీ తాను ఎవరికీ తలవంచే ప్రసక్తే లేదని లేఖలో ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తమిళ ప్రజలకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఫాసిస్టు మనస్తత్వం ఉన్న పార్టీలు లేదా అధికారంతో బెదిరించే శక్తులకు తాను భయపడనని, ప్రజల సంక్షేమమే తన లక్ష్యమని విజయ్ పేర్కొన్నారు. తమిళనాడు ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న డీఎంకే, విధానపరమైన వైరుధ్యాలున్న బీజేపీ వంటి పార్టీలు తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. తన పార్టీ కేవలం రాజకీయ విభాగం కాదని, అది సామాజిక న్యాయాన్ని కాపాడే కోట అని, ప్రజల గుండెల్లో వెలిగే నిజాయతీ గల నిప్పుకణిక అని అభివర్ణించారు. ఏప్రిల్ 23న జరగనున్న ఎన్నికల్లో కుటుంబ సమేతంగా వచ్చి 'విజిల్' గుర్తుకు ఓటు వేయాలని, మార్పు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

## పాలమూరు-రంగారెడ్డిపై అవాస్తవాల ప్రకటన

- 95శాతం ప్రాజెక్టు పూర్తయినట్లు రుజువు చేస్తే రాజీనామా: మంత్రి

**హైదరాబాద్, ఏప్రిల్ 21(నినాదం):** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు సంబంధించి బీఆర్ఎస్ నేతలకు మంత్రి వాకిటి శ్రీహరి సవాల్ విసిరారు. మంగళవారం మంత్రి మాట్లాడుతూ... పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ 95 శాతం పూర్తి అయినట్లు నిరూపిస్తే స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని అన్నారు. నిరూపిస్తే ఇక్కడి నుంచి వెళ్లి ఇప్పుడే రాజీనామాకు సిద్ధమని మంత్రి స్పష్టం చేశారు. అంతేకాదు రాజకీయాలకు దూరంగా ఉంటానని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంకా భ్రమల్లో ఉన్నారని.. ఆయన మాటలకు విశ్వసనీయత లేదని మంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంపై పూర్తి విశ్వాసం ఉందని మంత్రి తెలిపారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

## ఏసీబీ వలకు చిక్కిన పేట ఆర్డీఓ రాంచందర్ నాయక్


- 5 జనన ధృవీకరణ పత్రాలకోసం 25 వేల లంచం డిమాండ్
- డబ్బు తీసుకుంటూ ఏసీబీ కి దొరికి పోయాడు.
- ఆర్డీఓ నివాసాల్లో కూడా తనిఖీలు చేపట్టిన ఏసీబీ అధికారులు.



**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 21, (నినాదం):** నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏసీబీ అధికారులు ఆర్డీఓ కార్యాలయంపై దాడి చేయగా ఆర్డీఓ రాంచందర్ నాయక్ రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే పేట జిల్లా ఉట్కూర్ మండలం కేంద్రానికి చెందిన ఐదుగురు వ్యక్తులకు చెందిన జనన ధృవీకరణ పత్రాలకోసం 40 వేలు ఆర్డీఓ రాంచందర్ నాయక్ డిమాండ్ చేసినట్లు తెలియవచ్చింది. ఆర్డీఓ కార్యాలయ సిబ్బందిలో ఒక వ్యక్తి ద్వారా ఒక్కొక్క సర్టిఫికెట్ కి 5 వేల రూపాయల చొప్పున 25 వెలరూపాయలకు ఒప్పందం కుదుర్చుకొన్నట్లు తెలియవచ్చింది. అట్టి వ్యక్తులు ఏసీబీ అధికారులను సంప్రదించి విషయాన్ని తెలుపగా మంగళవారం నాడు వలపన్ని ఆర్డీఓ రాంచందర్ నాయక్ ను రెడ్ హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఏక కాలంలో ఆర్డీఓ రాంచందర్ నాయక్ నివాసాల్లో కూడా తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇంకాపూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దాడులతో జిల్లాలోని పలు శాఖల్లో నీ అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నట్లు సమాచారం.

# ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా మంచిర్యాల

- మంచిర్యాలలో అత్యధికంగా 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు
- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లోనూ 41 డిగ్రీలు దాటిన ఎండలు



**మంచిర్యాల, ఏప్రిల్ 21 (నినాదం):** తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే, మంచిర్యాల ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా నిలిచింది. అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ సంస్థ 'ఎల్డోరాడో వెదర్' తాజాగా రూపొందించిన ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాల జాబితాలో మంచిర్యాల 14వ స్థానంలో నిలవడం గమనార్హం. సోమవారం (ఏప్రిల్ 20) మంచిర్యాలలో 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్డోరాడో వెదర్ జాబితాలో మహారాష్ట్రలోని అకోలా 45 డిగ్రీలతో అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తే.. కొత్తగూడెం, గద్వాలలో 43.3, నిర్మల్, నిజామాబాద్‌లలో 43.0 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతంలో ఎండలు ఇంత తీవ్రంగా ఉండటానికి భౌగోళిక కారణాలతో పాటు అటవీ విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణమని వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలోని విదర్భ సరిహద్దులో ఉండటం వల్ల, మధ్య భారతం నుంచి వీచే పొడి, వేడి గాలులు ఇక్కడ ఉష్ణోగ్రతలను అమాంతం పెంచుతున్నాయి. దీనికి తోడు 2021లో 18,561 చదరపు కిలోమీటర్లుగా ఉన్న తెలంగాణ అటవీ విస్తీర్ణం, 2023 నాటికి 18,456 చదరపు కిలోమీటర్లకు తగ్గింది. ప్రధానంగా ఆదిలాబాద్, కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాల్లో పచ్చదనం తగ్గడం వల్లే సహజసిద్ధమైన చల్లదనం లోపించి హీట్ వేవ్స్ తీవ్రత పెరుగుతోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మరోవైపు రాజధాని హైదరాబాద్‌లోని పట్టణ ప్రాంతాలు కూడా గ్లోబల్ హీట్ లిస్టులో చేరుతున్నాయి. మూసీ నది పరీవాహక ప్రాంతం కావడం, వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, భూగర్భ జలాలు పడిపోవడం వల్ల ఇక్కడ వేడి ఎక్కువగా ట్రాప్ అవుతోంది. నగరంలోని న్యూ నాగోల్ ప్రాంతంలో 41.7 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, ముషీరాబాద్‌లో 41.6, అంబర్‌పేటలో 41.4, మల్కాజిగిరి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో 41.3, మెహదీపట్నంలో 41.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట ఎండలు దంచికొడుతున్నా.. రానున్న 24 గంటల్లో కొన్ని చోట్ల ఊరట లభించే అవకాశం ఉంది. నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, వికారాబాద్, మెదక్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే, పగటి పూట ఎండ తీవ్రత మాత్రం 40 నుంచి 45 డిగ్రీల మధ్యే కొనసాగే ప్రమాదం ఉందని, బయటకు వచ్చే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.